www.aakshitha.com

People's voice


# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 19 | జూన్ | 2026 | పేజీలు: 08



## మెరుగైన వైద్య సేవలు

**విధుల్లో అలసత్వం వద్దు**

**కలెక్టర్ చంద్ర శేఖర్**

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:** నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వైద్యుడు విధులకు సమయానికి హాజరుకావాలని , ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు వైద్యులు, సిబ్బంది ..మిగతా 2లో

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా ఐకేపీ రైతు సేవా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి సూచించారు. గురువారం, జనగామ మండలంలోని మరిగడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకేపీ రైతు సేవా కేంద్రాన్ని లికలెక్టర్‌లి ప్రారంభించి, కేంద్రంలోని సౌకర్యాలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు.



## రైతులకు నాణ్యమైన సేవలు

**రైతు సంక్షేమానికి ఐకేపీ రైతు సేవా కేంద్రాలు కీలకం**



**లైసెన్సులను స్పష్టంగా ప్రదర్శించాలి**

**నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులే విక్రయించాలి**

**ఈ-పాస్ యంత్రం, బిల్లు బుక్కుల తనిఖీ**

**పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాలి**

**ఐకేపీ రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**జనగామ, అక్షిత బ్యూరో :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా ఐకేపీ రైతు సేవా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి సూచించారు. గురువారం, జనగామ మండలంలోని ..మిగతా 2లో






దోచుకోవడం

## గులాబీ పేటెంట్

**దొర మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం**

**కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాటా ఎంతో చెప్పాలి**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**కరీంనగర్, అక్షిత బ్యూరో :** హరీష్ రావు దొర మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ..మిగతా 2లో





ఓటర్ల జాబితా

## ప్రక్షాళన

**ప్రత్యేక సమగ్ర సవరణకు సహకరించాలి**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై(సర్) సమీక్షా ..మిగతా 2లో



భక్తులకు ఇబ్బందులు

## తలెత్తొద్దు

**గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు**

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** బాసరలో జరుగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ..మిగతా 2లో

## భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

**మొదటి పేజీ తరువాయి...**

ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రక్షాళన




**మొదటి పేజీ తరువాయి...**

సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. జూన్ 25 – జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 – 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.

ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కార్యక్రమం లో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, సాయి బాబా (ఐ.ఎన్.సి), యాద సత్యం.(బి.ఆర్.ఎస్),పి.రాజేందర్ రెడ్డి (బి జె.పి ), ఎం.డి.అబ్దుల్ హాది ,సాదతుల్ల,(ఎం.ఐ.ఎం),బి.డి.సామ్యూల్(వై.ఎస్.ఆర్.సి.పి),వై.నర్సింహులు,(బి.ఎ స్.పి),ఎం.మురళి(టి. డి.పి) తదితరులు పాల్గొన్నారు.

# దోచుకోవడం గులాబీ పేటెంట్

**మొదటి పేజీ తరువాయి...**



అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏనాడు కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖరారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు.మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొర మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖాబ్దార్ అని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు. 2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఏలా గెలిచాడో తెలంగాణ ప్రజలందరికి తెలుసని అన్నారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం తాళం పోతే ఎక్కడ పోయిందని అడిగితే మంత్రి ఉన్న కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్పలేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొప్పులపై తాను 2009లో పోటీ చేస్తే కేవలం1165ఓట్ల తేడాతో ఓడిపోయానని, 2014లో 16వేల మెజార్టీతో ఓడిపోయానని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవ్వరికి డిపాజిట్ రాలేదని తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో ఏమీ తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ఈశ్వర్ కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి అడ్లూరి అన్నారు. 2024 పార్లమెంట్ఎన్నికల్లో సైతం ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పులకు ఓట్లే వేయలేదని మంత్రి అడ్లూరి తెలిపారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పేటెంట్ హక్కు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగాఉన్న కొప్పుల, గురుకుల కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్ కలిసి దోచుకున్నారు కనుక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి..కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వద్ద కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డి కి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

# రైతులకు నాణ్యమైన సేవలు

**మొదటి పేజీ తరువాయి...**

మరిగడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకేపీ రైతు సేవా కేంద్రాన్ని లికలెక్టర్‌లి ప్రారంభించి, కేంద్రంలోని సౌకర్యాలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు.



నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ-పాస్ యంత్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు విక్రయాల నమోదు, బిల్లుల జారీ, స్టాక్ నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి, సంబంధిత నిర్వాహకులకు సూచనలు చేశారు. అలాగే బిల్లు బుక్కులను పరిశీలించి, ప్రతి లావాదేవీకి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, పారదర్శకతతో వ్యవహరించాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాన్ని క్రమబద్ధంగా, సమర్థవంతంగా నడిపిస్తే ప్రతి నెల రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.

వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

రైతు సేవా కేంద్రాలు రైతులకు విశ్వసనీయ సేవా కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎం నూరుద్దీన్, ఇతర సంబంధిత అధికారులు, రైతు సేవా కేంద్రాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు

**మొదటి పేజీ తరువాయి...**

హాజరు వివరాలను తనకు నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల హెచ్‌వోడీలను ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలు, ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు.

ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన కలెక్టర్, అవసరమైన పరికరాలను సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్





సత్యనారాయణ , ప్రభుత్వ డాక్టర్లు, డాక్టర్ నగేష్ , వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

# మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

### మహిళ భద్రతపై పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు : జిల్లా షీ టీమ్



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళలకు సంబంధించిన చట్టాలు మరియు వారి హక్కులపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా గురువారం గంబిరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని సూచించారు.




ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని షీ టీమ్ అధికారులు తెలిపారు.

అలాగే సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకుండా జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు లేదా ఇతర వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత పాల్గొన్నారు.

# భక్తి భావం మానసిక ప్రశాంతతను అందచేస్తుంది

### ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

### చిన్నఉమెంత్యాల గ్రామంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్నఉమెంత్యాల గ్రామంలో జరిగిన మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో' ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ భక్తి భావం మానసిక ప్రశాంతతను ఇస్తుందని,గ్రామాలు సుభిక్షంగా ఉండటానికి గ్రామ దేవతల ఆశీస్సులు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,మాజీ జెడ్పిటిసి తనయుడు రామక్రిష్ణ చిన్నఉమేంత్యాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,ఉపసర్పంచ్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ నర్సిములు,మాజీ ఎంపిపి తనయుడు గోపాల్,మహదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,అయోధ్యపూర్ సర్పంచ్ గోపాల్ నాయక్,చింతకుంటతండా మాజీ సర్పంచ్ హరినాయక్,చిన్న ఉమేంత్యాల వార్డ్ మెంబెర్స్, శ్రీను,కబీర్ కృష్ణ,నర్సిములు గ్రామ పెద్దలు రాయికంటి కృష్ణారెడ్డి,ఎన్నంపల్లి రాఘవేందర్ రెడ్డి,బాలనగర్ హనుమంత్ రెడ్డి,సుభాన్ రెడ్డి,భూపాల్ గౌడ్ మరియు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి దృష్టికి విఠల్ రెడ్డి వినతి

### సోనారి-కుబీర్ రోడ్డుకు బీటీ రిన్యువల్ చేపట్టాలని విజ్ఞప్తి

### ఇతర రోడ్ల సమస్యలపై కూడా వివరాలు



**నిర్మల్ అక్షిత బ్యూరో జూన్ 18:** తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిను ముధోల్ మాజీ శాసనసభ్యులు జీ. విట్టల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కుబీర్ మండలంలోని సోనారి గ్రామం నుండి కుబీర్ వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ రహదారికి వెంటనే బీటీ (బిటుమెన్) రిన్యువల్ పనులు చేపట్టి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని మంత్రిని కోరారు. అదేవిధంగా ముధోల్ నియోజకవర్గ పరిధిలోని ఇతర ప్రధాన రహదారుల పరిస్థితులను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిని సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆడపడుచు పెళ్లికి ఏజేఆర్ ఫౌండేషన్ పెళ్లి కానుక



**వలిగొండ/అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన బండారు భద్రయ్య భారతమ్మ దంపతుల కుమార్తె బండారు మనీషా వివాహం టేకుల సోమారం గ్రామంలోని ఎంఎంఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఇట్టి వివాహ వేడుకకు హాజరైన ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి పదివేల రూపాయలను ఆడపడుచు పెళ్లి కానుకగా అందించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ యువత ఏజేఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సు కోసం జీవించే వారే నిజమైన ధన్యులు...

### ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవాకార్యక్రమాలు అభినందనీయం...

### విద్యాభివృద్ధికి రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి...

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి....

### ఇంజాపూర్ జడ్పిహెచ్ఎస్ లో సరస్వతీమాత విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే....





**ఇబ్రహీంపట్నం, అక్షిత ప్రతినిధి:** సమాజ శ్రేయస్సు కోసం జీవించే వారు నిజమైన ధన్యజీవులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇంజాపూర్ కు చెందిన బొక్క భూపాల్ రెడ్డి అనే వ్యక్తి... తన 83వ జన్మదినాన్ని పురస్కరించుకుని, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే... భూపాల్ రెడ్డి పాఠశాలకిచ్చిన యూనిఫాం, పుస్తకాలు, ప్లేట్లు, ఇతర వస్తువులను విద్యార్థులకు అందజేశారు. భూపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మల్ రెడ్డి... నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పిల్లల భవిష్యత్ కోసం భూపాల్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించటం పట్ల మల్ రెడ్డి రంగారెడ్డి అభినందనలు తెలిపారు. సమాజంలో సేవా ధృక్పథం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తమకున్నదానిలో కొంత ఇతరులకు పంచినప్పుడే ఉన్నతమైన సమాజం నిర్మితమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్న ఎమ్మెల్యే.... సరికొత్త విధానాలతో భవిష్యత్తుకు బంగారుబాటలలు వేస్తున్నట్లు చెప్పారు. భూపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించిన జిల్లెల్ల రాములు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో జమ్ముల వెంకటయ్య(60) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతిచెందాడు.మృతి విషయం తెలుసుకున్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ మరియు విజిలెన్స్ కమిటీ మెంబర్, మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతుని కుటుంబ సభ్యులను పర్మార్శించి,మృతుని కుమారుడు సైదులుకు 3000/- వేల రూపాయలు ఆర్థికసహాయం అందజేషి మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరిరవిగౌడ్, ఉపసర్పంచ్ ఎముక రవి, మాజీ ఉపసర్పంచ్ వీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మొక్తాల బాల్ జంగయ్య,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తాడేం జంగయ్య, ఉపాధ్యక్షులు యార సురేష్,నాయకులు కుమ్మరి శివసాయి, వీరెడ్డి పవన్ రెడ్డి, జమ్ముల కృష్ణ, యార పరుశరాములు తదితరులు పాల్గొన్నారు

## సంబంధిత శాఖల అధికారులతో కమిటీ వేసి వెంటనే అడవి పశువులను తరలిస్తాము

### పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ రావు



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** అడవి పశువులను తరలించి రైతుల పంట పొలాలను కాపాడాలని సోమవారం రంగారెడ్డి జిల్లా ప్రజావాణిలో బండ లేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ పొచమోని కృష్ణ వినతిపత్రం అందజేసి బైఠాయించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ మేరకు గురువారం పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు బండలేమురు గ్రామాన్ని సందర్శించి పశువుల వలన నష్టపోతున్న రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ పొచమోని కృష్ణ, ఉపసర్పంచ్ బూడిద రమేష్, రైతులు మాట్లాడుతూ అడవి పశువుల వలన మా గ్రామంలో వందలాది మంది రైతులు పంటలు వేయకుండా పడావు ఉంచామని చెప్పారు. పదేళ్లుగా మా పంట పొలాలను మేస్తూ మాకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పశువులను తరలించాలని ప్రభుత్వాధికారులకు ఎన్నిసార్లు విన్నవిచ్చిన ఫలితం లేదని, ఇప్పటికైనా వాటిని తరలించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు వర్షాకాలం వచ్చి అన్ని గ్రామాలలో ప్రజలు పంటలు వేసుకుంటుంటే మేము మాత్రం భూములను పంటలు వేసుకోకుండా పడావుంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

పంటలకు విత్తనాలు నాటే సమయం కావున పశువులను వెంటనే తరలిస్తే మా పంట పొలాల్లో పంటలు వేసుకుంటామని చెప్పారు. త్వరగా అడవి పశువులను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మీ అభిప్రాయాల ప్రకారం త్వరలోనే పశువులను తరలిస్తామని అన్నారు. పశు సంవర్ధక, ఫారెస్టు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గ్రామస్తులతో కమిటీ వేసి కలెక్టర్ కు నివేదిక అందజేసి తదుపరి ఆదేశాల మేరకు పశువులను తరలిస్తామనీ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆరుట్ల పశు వైద్య డాక్టర్ చంద్రావతి, మెంబర్లు అచ్చలి , సుజాత, శోభ, రైతులు బద్దుల గాలయ్య, జోగు సాయిలు,సోమయ్య, సత్యం,పూర్య,భగ్య, లక్ష్మమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ ఇంచార్జ్, టీపీసీసీ అధ్యక్షుల పర్యటనను

# విజయవంతం చేయాలి

### ఎస్ఐఆర్ అవగాహన సదస్సుకు బీఎల్‌ఏలు తప్పనిసరిగా హాజరుకావాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** ఈ నెల 22వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ, టీపీసీసీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్



పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైందని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడం, అక్రమాలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించడం వంటి అంశాల్లో బీఎల్‌ఏల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు.

ఈ నెల 22న జరగనున్న అవగాహన సదస్సుకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అన్ని బూత్‌లకు చెందిన బీఎల్‌ఏలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

అలాగే ఈ నెల 25వ తేదీ నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపథ్యంలో, బీఎల్‌ఏలు కూడా వారితో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు కావడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు సక్రమంగా సవరించబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఈ వి శ్రీనివాస్ రావు,టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టం -2009

# పటిష్టంగా అమలు చేయాలి

### కార్పొరేట్,ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

### టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ డిమాండ్



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వారు తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టిఈ)సమర్థంగా అమలు చేయలేక పోతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టిఆర్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని విద్యా హక్కు చట్టం స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు.సంపన్నులు, నిరుపేదలు అనే తేడా లేకుండా అందరికీ నాణ్యమైన విద్య అందించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అయినప్పటికీ కార్పోరేట్,ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు.దీంతో నీరుపేదలు ఫీజుల భారం మోయలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో జిల్లా కేంద్రంలో సుమారు 75 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నట్లు తాము గుర్తించామని,అవి అధిక ఫీజులు వసూలు చేస్తే తెలంగాణ రాజ్యాధికార పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు చట్టబద్ధంగా లభించాల్సిన రిజర్వేషన్లు తప్పని సరిగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.తమ పార్టీ విద్యార్థి నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు అందుబాటులో ఉంటూ,విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల,పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు,జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మామిడి శోభన్,జిల్లా యువజన అధ్యక్షుడు కోలా కరుణాకర్,లింగాల సైదులు,సూపర్ సైదులు,నేలచర్ల మధు,దీపమల,రంప శ్రీదేవి,కుంభం వెంకన్న,మధు,రఘు, శేఖర్,విజయ్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యని విమర్శించడం సరికాదు



**అక్షిత ప్రతినిధి రామన్నపేట:** ఈరోజు రామన్నపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ15-6-2026 సోమవారం రోజున మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారు మండలంలోని కొన్ని గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న బాధలను చూసి రైతులకు జరుగుతున్న నష్టాలను వారి యొక్క కష్టాలను రైతులు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సార్ కు తెలియజేస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో మూడు నెలలు క్రితం వడ్లను మార్కెట్లోకి తెచ్చిన కొంటలేరు 40 కిలోల బస్తాకు 42 కిలోల 200 గ్రాముల వడ్లని జోకడం జరుగుతుంది గోడౌన్లో అన్లోడ్కు ఒక బస్తాకు 5 రూపాయలు రైతు దగ్గర తీసుకోవడం జరుగుతుంది వడ్లను లారీలో లోడ్ చేసిన తర్వాత మిల్లుల వద్దకు పంపగా ధాన్యం తూకం తక్కువగా ఉందని 500 బస్తాల రైతుకు 22 బస్తాల వడ్లను కట్ చేయడం జరుగుతుంది 20 రోజుల క్రితం పోయిన వడ్లకు డబ్బులు రైతుల ఖాతాలో పడట్లేదు ఎండలకు వానలకు గాలి దుమారాలకు టార్పిన్ పట్టాలు చినిగిపోవడం జరుగుతుంది ఈ విషయాలను మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారికి తెలుపగా వారు రైతులు పడుతున్న బాధను తెలుసుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగింది. దీనికి రామన్నపేట కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారు రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాడని సోషల్ మీడియాలో ప్రచారం కోసం చేస్తున్నాడని నిన్న పత్రిక సమావేశంలో చెప్తున్నారు నిజాలు తెలుసుకొని రైతులకు జరుగుతున్న నష్టాలను వాస్తవాలను మాట్లాడితే రాజకీయ పబ్బం గడుపుకోవడం ఎలా అవుతుంది వాస్తవాలు మాట్లాడితే అసత్య ప్రచారాలు అంటారా ఇకనైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారిపై మాట్లాడే తప్పుడు మాటలు అసత్య ప్రచారం మానుకోవాలని తెలియజేయడం జరిగింది.

# మూగబోయిన కాడెడ్ల చప్పుడు

**వేగంగా కనుమరుగవుతున్న పల్లెటూరి సంప్రదాయం**

**యాంత్రీకరణతో అదృశ్యం అవుతున్న నాగళ్లు, ఎద్దుల బండ్లు**

**కూలీల కొరత, నిర్వహణ భారంతో ట్రాక్టర్ల వైపు మొగ్గు చూపుతున్న రైతాంగం**

**"ఆనాటి సంతృప్తి ఇప్పట్లో లేదు" అంటూ వృద్ధ రైతుల ఆవేదన**

**భావితరాల కోసం వ్యవసాయ మ్యూజియంలు ఏర్పాటు చేయాలంటున్న నిపుణులు**





**యాదాద్రి భువనగిరి/అక్షిత బ్యూరో:** ఒకప్పుడు తెలంగాణ గ్రామాల్లో రైతు కుటుంబాల జీవన విధానంలో, సంస్కృతిలో కాడెడ్లు (ఎద్దుల జంటలు) కీలక పాత్ర పోషించేవి. పల్లెల్లో వ్యవసాయ పనులన్నీ ఎద్దుల ఆధారంగానే సాగేవి. కానీ, కాలక్రమేణా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కాడెడ్లు, నాగళ్లు, ఎద్దుల బండ్లు వంటి సంప్రదాయ వ్యవసాయ పరికరాలు నేడు చరిత్ర పుటల్లో కలిసిపోతున్నాయి.

**కనిపించని ఆ పాత దృశ్యం..**

గతంలో వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు గ్రామాల్లో ఎద్దుల జంటలతో పొలాలు దున్నడం ఒక సాధారణ సుందర దృశ్యంగా కనిపించేది. తెల్లవారుజామునే "హల్లో... హల్లో..." అంటూ రైతు పెట్టే కేకలు, ఎద్దుల మెడలో గంటల చప్పుడు, నాగలి భూమిని చీలుస్తూ చేసే సవ్వడి... ఇవన్నీ పల్లె సీమలకు ఒక ప్రత్యేకమైన అందాన్ని ఇచ్చేవి. ప్రస్తుతం ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, హార్వెస్టర్లు వ్యవసాయ రంగంలో విరివిగా ప్రవేశించడంతో రైతులు వేగవంతమైన ఆధునిక పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా కాడెట్ల వినియోగం గ్రామాల్లో పూర్తిగా తగ్గిపోయింది.

**యాంత్రీకరణ వెనుక ఉన్న కారణాలు ఇవే**

యాంత్రీకరణ వల్ల రైతుల శ్రమ తగ్గి, సమయం ఆదా అవుతున్నప్పటికీ, సంప్రదాయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకలైన కాడెడ్లు అంతరించిపో వడం ఆందోళన కలిగిస్తోందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో తీవ్రమైన కూలీల కొరత వేధించడం, ఎద్దులమేత ఖర్చులు పెరగడం, వాటి నిర్వహణ భారం కావడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పల్లెల్లో ఎద్దులను పెంచే రైతుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోవడంతో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

**ఆ రోజుల్లో ఉన్న సంతృప్తి ఇప్పుడు లేదు**

"ఒక ఎకరం పొలం దున్నడానికి ఆ రోజుల్లో రెండు రోజులు పట్టేది. ఇప్పుడు ట్రాక్టర్ తో గంటలో పని అయిపోతోంది. అయినా ఆ రోజుల్లో ఉన్న సంతృప్తి, ఆనందం ఇప్పుడు ఎక్కడా లేదు. ఎద్దులతో మాట్లాడుకుంటూ పొలం దున్నడం ఒక యోగం లాంటిది. కాడెట్ల శబ్దం, పల్లెల్లో ఆ పాత రోజులు మళ్లీ తిరిగి రావాలని వృద్ధ రైతులు కోరుకుంటు న్నారు.

**వారసత్వాన్ని కాపాడాలి**

ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేటి కాలానికి అవ సరమైనప్పటికీ, మన గ్రామీణ వారసత్వాన్ని కాపాడే ప్రయత్నాలు కూడా సమాంతరంగా జర గాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పాఠశాల స్థాయిలో 'వ్యవసాయ మ్యూజియంలు' ఏర్పాటు చేసి నాగలి, కాడి, గుంటక వంటి సంప్రదాయ పరికరాలను భావిత రాలకు పరిచయం చేయాలని వారు అభిప్రాయ పడుతున్నారు.వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు అభివృ ద్ధికి సంకేతాలైనా, సంప్రదాయ వ్యవసాయ సంస్కృతి క్రమంగా కనుమరుగవుతుండటం గ్రామీణ జీవితంలో ఒక పెద్ద శూన్యతను మిగులు స్తోంది. యంత్రాల హోరులో కాడెట్ల చప్పుడు శాశ్వతంగా మూగబోతుందేమోనన్న ఆవేదన పల్లె జనం గుండెల్లో వినిపిస్తోంది.

## న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు అందించాలి

**ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్**

**జూన్ 20న ఇందిరాపార్క్ ముందు న్యాయవాదుల ధర్నా**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో నమోదు చేసుకున్న న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జూన్ 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఈరోజు రామన్నపేట బార్ అసోసియేషన్ హాల్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. మజీద్, కార్యదర్శి యాదాసు యాదయ్య కరపత్రాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2019 తర్వాత నమోదు చేసుకున్న వేలాది మంది న్యాయవాదులు ఇప్పటికీ హెల్త్ కార్డుల ప్రయోజనాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి న్యాయవాదికి, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే ఆరోగ్య బీమా పరిమితిని పెంచడం, కుటుంబ సభ్యులు మరియు తల్లిదండ్రులను కూడా బీమా పరిధిలోకి తీసుకురావడం, రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆసుపత్రులను ఎంపానెల్ చేయడం, అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు అదనపు నిధులు కేటాయించడం వంటి డిమాండ్ల సాధన కోసం న్యాయవాదులంతా ఐక్యంగా జూన్ 20న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సంగిశెట్టి బాలరాజు, కునూరు శ్రీనివాస్, నోముల స్వామి, జెల్లా రమేష్ గడ్డం నరసింహ ,గాలి సుదర్శన్, శంకర్, అంకం నరేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అర్వపల్లి ఎస్సై ఈటా సైదులు సస్పెండ్



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, నాగారం సర్కిల్ పరిధిలోని అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఈటా సైదులను బుధవారం జిల్లా ఎస్పీ కె నరసింహ సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, ఒక కీలక ఫోక్సో కేసు వ్యవహారంలో అనుచిత ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు ఈ చర్య తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.పలు కేసుల్లో ఆధారాలను తారుమారు చేసి అవినీతి, అక్రమాలను పాల్పడ్డట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ ఘటనల పై ఉన్నతాధికారులు ప్రాథమిక స్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. విచారణలో బయటపడిన అంశాల ఆధారంగా తక్షణ చర్యగా సస్పెన్షన్ విధించినట్లు సమాచారం. ఈ పరిణామం పోలీస్ విభాగంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. విచారణ అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## క్యూఎస్-2027 ర్యాంకింగ్స్‌లో
# ఐఐటీ హైదరాబాద్‌కు విశేష గుర్తింపు

**ప్రపంచ ర్యాంక్ 588 సాధించి 76 స్థానాల మెరుగుదల**

**పరిశోధన ప్రభావంలో ప్రపంచ టాప్-123లో స్థానం**




**సంగారెడ్డి అక్షిత బ్యూరో :** భారతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఐఐటీ) హైదరాబాద్ అంతర్జాతీయ విద్యా రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. క్యూస్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్--2027లో గ్లోబల్ ర్యాంక్ 588 సాధించి గత ఏడాది 664వ స్థానంతో పోలిస్తే 76 స్థానాలు మెరుగుపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రగతి సాధించిన ఉన్నత విద్యాసంస్థల్లో ఐఐటీ హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. పరిశోధన నాణ్యత, ప్రభావానికి ప్రతీకగా నిలిచే సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ విభాగంలో ఐఐటీ హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో 123వ ర్యాంక్ సాధించడం విశేషం. ఈ విభాగంలో సంస్థ స్కోరు 86.8కు పెరగడం ద్వారా అధ్యాపకులు, పరిశోధకుల పరిశోధనలు ప్రపంచ శాస్త్రీయ వేదికలపై విశేష ప్రభావం చూపుతున్నట్లు వెల్లడైంది. అకడమిక్ ప్రతిష్ఠ, ఎంప్లాయర్ రెప్యుటేషన్, ఉపాధి ఫలితాలు, సస్టైనబిలిటీ వంటి కీలక సూచీల్లోనూ సంస్థ గణనీయమైన పురోగతి సాధించింది. మొత్తం స్కోరు 28.7కు చేరుకోగా, ప్రపంచవ్యాప్తంగా ర్యాంక్ పొందిన సంస్థల్లో 61 శాతం కంటే మెరుగైన పనితీరు కనబరిచింది. ఏడాది వారీగా ర్యాంకుల ప్రగతి 2027 గ్లోబల్ ర్యాంక్ 588, సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ 123, ప్రపంచ సంస్థల్లో 61శాతం కంటే మెరుగైన ప్రదర్శన, 2026: గ్లోబల్ ర్యాంక్ 664, స్కోరు 84, ప్రపంచ సంస్థల్లో 55.9శాతం కంటే మెరుగైన ప్రదర్శన, 2025: గ్లోబల్ ర్యాంక్ 681--690, స్కోరు 71.1, ప్రపంచ సంస్థల్లో 54.2శాతం కంటే మెరుగైన ప్రదర్శన, గత నాలుగేళ్లుగా ఐఐటీ హైదరాబాద్ అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో నిరంతర పురోగతి సాధిస్తోంది. 2024లో 691--700 బ్యాండ్‌లో ఉన్న సంస్థ, 2026లో 664వ స్థానానికి, ప్రస్తుతం 2027లో 588వ స్థానానికి చేరుకోవడం విశేష ప్రగతిగా విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఉన్నత ప్రమాణాల పరిశోధనలు, అంతరశాఖ సహకారం, నవీన ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలే ఈ విజయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, డీప్-టెక్ ఆవిష్కరణలు, అనువర్తిత పరిశోధన, నాణ్యమైన విద్యా వ్యవస్థకు ప్రపంచ స్థాయిలో లభించిన గుర్తింపే ఈ ర్యాంకు అని అన్నారు. ప్రపంచ ర్యాంకుల్లో 76 స్థానాలు మెరుగుపడటం, సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ విభాగంలో టాప్-123లో నిలవడం సంస్థ పరిశోధనల అంతర్జాతీయ ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. క్యూఎస్ ర్యాంకింగ్ సమన్వయకర్త డా. సౌరభ్ సాండిల్యా మాట్లాడుతూ, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, పరిపాలనా సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వ్యూహాత్మక రంగాల్లో అభివృద్ధికి ఈ విజయం ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ నియామకం



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ప్రకటించారు. బుధవారం ఆయన నివాసంలో జరిగిన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను బెలిదె శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామని, అందుకోసం కమిటీ సభ్యులందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని అన్నారు.

**నియామక కమిటీ**

ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శిగా బిక్కుమళ్ల కృష్ణ, సహాయ కార్యదర్శి గా సోమ ప్రవీణ్,అదనపు కార్యదర్శిగా గుండా వెంకన్న(సుమన్), పొలిటికల్ చైర్మన్ గా రాచకొండ శ్రీనివాస్,మహిళా విభాగం అధ్యక్షురాలుగా మిట్టపల్లి శ్రీదేవి, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గా బెలిదె రాధ,గౌరవ సలహాదారులుగా పుప్పాల సత్యనారాయణ,మిట్టపల్లి రమేష్,ఉపాధ్యక్షులుగా కుంచపర్తి రాజశేఖర్,డోగుపర్తి ప్రవీణ్ లకు నియామక పత్రాలను అందజేశారు.

## ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమంపై బీజేపీ అవగాహన సమావేశం

**సాంకేతికతతో పకడ్బందీ ఓటరు జాబితా రూపకల్పన లక్ష్యం: ఎమ్మెల్సీ అంజిరెడ్డి**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో :** సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న పాలకులు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందో ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేపడితే అక్రమంగా నమోదైన ఓట్లు బయటపడతాయనే భయంతో విమర్శలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో ప్రతి వ్యక్తికి ఒకే ఓటు ఉండే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. 2002 సంవత్సరం నుంచి ఉన్న ఓటరు వివరాలను ప్రామాణికంగా తీసుకుని, వాటి ఆధారంగా మిగిలిన నమోదులను పరిశీలించి నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడమే ఈ సవరణ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటు చోరీ పేరుతో చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని పేర్కొంటూ, ఎక్కడా ఓట్ల దొంగతనం జరగలేదని అన్నారు. దేశంలో జన్మించిన ప్రతి పౌరుడికి కుల, మత, వర్గ భేదాలు లేకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**మానకొండూర్ అక్షిత న్యూస్:** మౌలిక వసతుల కల్పనతోనే గ్రామీణ ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి సాధిస్తాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండలం ధర్మారం గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కింద రూ.41 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పర్చాలనే ఉద్దేశంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పెద్దపీట వేస్తున్నామన్నారు. ముఖ్యంగా రవాణా వ్యవస్థ మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, విద్య, వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పుడే గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా పట్టణాలకు సమానంగా అన్ని సౌకర్యాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న అనేక గ్రామాల్లో ప్రస్తుతం కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి పథకాలు చేపడుతున్నామని చెప్పారు. అదే క్రమంలో ధర్మారం గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించిన విషయాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధర్మారం గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రవి, పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, ధర్మారం గ్రామ సర్పంచ్ చింతిరెడ్డి పద్మ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దేవునూరి కిష్టయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు గట్టు తిరుపతి గౌడ్, గోపగోని బస్వయ్య గౌడ్,ఉప్పుగళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యూరియా యాప్‌ని రద్దు చేయాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో

## వేల్పూరు ఎక్స్ రోడ్‌లో భారీ రాస్తారోకో

**రైతులను రోడ్లపైకి లాగిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే**

**రైతు ఏడ్చిన రాజ్యం ఎన్నటికీ బాగుపడదు**

**కేసీఆర్ పాలనలో రారాజుగా ఉన్న రైతు.. నేడు రేవంత్ రాజ్యంలో రోడ్డున పడ్డాడు**

**ప్రభుత్వము ముందు పలు డిమాండ్లను ఉంచిన ఎమ్మెల్యే వేముల**





**భీంగల్ అక్షిత న్యూస్ :** రైతులను ఇబ్బంది పెడుతున్న యూరియా యాప్ ను పూర్తిగా రద్దు చేయాలనీ, రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఎలాంటి ఆంక్షలు లేకుండా ఒకేసారి పంపిణీ చేయాలని మరియు సొసైటీలో షాపుల్లో సరిపడా యూరియా విరివిగా ఉంచాలని పలు డిమాండ్‌తో బాల్కొండ నియోజకవర్గం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ 63 వేల్పూర్ ఎక్స్ ఎ రోడ్ భారీ ధర్నా, రస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు కడుపు మంటతో, ఆవేదనతో రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితిని ఈ రాక్షస ప్రభుత్వం, దుర్మార్గపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని ధ్వజమెత్తారు. “ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం” ఎన్నటికీ ముందడుగు వేయలేదని, రైతులు లేకపోతే రాజ్యమే లేదని మన పెద్దలు చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు ప్రతి చిన్న అవసరానికి, హక్కుల కోసం రోడ్డెక్కి కొట్లాడాల్సి వస్తోందని, అలాంటి దారుణమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేసారు**

ఎరువుల కొనుగోలు కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న యాప్ విధానం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎకరానికి కనీసం 4 సంచుల చొప్పున యూరియాను అందించాలని, అది కూడా విడతల వారీగా కాకుండా ఒకే విడతలో (ఒకేసారి) సరఫరా చేయాలని స్పష్టం చేశారు.

గతంలో లాగే అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) మరియు ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా నిల్వలను విరివిగా, సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచాలని కోరారు.

రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను మరింత పెంచేలా స్థానిక బీజేపీ ఎంపీ చొరవ చూపాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో మాట్లాడి అదనపు సరఫరా చేయించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం పెంచిన 20-20-0, జింక్ మరియు ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలను తక్షణమే తగ్గించి రైతులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి అందించిన విధంగా నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి.

డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాము అని జిల్లా కలెక్టర్ చెప్పడంతో ధర్నా విరమించారు.

### ఆధ్యాత్మిక, మహిమాన్విత, అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయ

# షోడశ (16వ) వార్షికోత్సవం




**ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం...శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వార్షికోత్సవ వేడుకలు, పూజలు**

**వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లాలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతు, కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవం, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా మారిన దివ్య పుణ్యక్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయ" షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. నేడు జరగనున్న వార్షికోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అత్యంత వైభవంగా వేడుకలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు.

వార్షికోత్సవం రోజైన నేడు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు.

ఉదయం 4:30 నిమిషాలకు జగద్గురువుల కరకమలములచే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంతనాగేంద్ర స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేక పూజలు ,ఉదయం 8:00 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండల పూజలతో పాటు లోకకల్యాణార్థం లక్ష్మీగణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమము, పూర్ణాహుతి, మంత్రపుష్పం అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం (ఆశీర్వచనం), తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది

లిత్రిశక్తుల స్వరూపం – మహిమాన్విత దివ్య క్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయంలి

ఒకే దేవాలయ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం.లిశ్రీ మహాదుర్గలి భక్తులకు రక్షణను, ధైర్యాన్ని ప్రసాదించే శక్తి స్వరూపిణి.

ముఖ్యంగా దేవాలయంలో కన్నుల పండుగగా అనేక ప్రధాన ఉత్సవాలు, పండుగ వేళల్లో ఉగాది, శ్రీ సీతారాముల కళ్యాణం, వసంత పంచమి, మహాశివరాత్రి, సంకటహర చతుర్థి, శ్రావణ మాస ప్రత్యేక పూజలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, వినాయక నవరాత్రులు, దీపావళి , తులసి కళ్యాణం, అయ్యప్ప స్వామి పడిపూజ , మార్గశిర మాసం– ధనుర్మాసం, రుద్ర సహిత చండీ హోమం, నాగుల పంచమి, చవితి లాంటి పర్వదినాల్లోఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రధానంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, అన్నదానాలు భారీ ఎత్తున దాండియా నృత్యాలు ఘనంగా ప్రతిఏటా నిర్వహిస్తారు. అలాగే విజయదశమి సమయంలో ఇక్కడ భవానీ మాల ధరించిన దీక్షాపరుల కోలాహలం ఎక్కువగా ఉంటుంది. విజయవాడ తర్వాత అదే స్థాయిలో భవాని మాల ధారులకు శ్రీ మహాశక్తి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ఏటా వేలాదిమంది దీక్షపరులు ఇక్కడ భవాని మాల ధారణ చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులు సైతం ఇక్కడ దీక్షలు చేపట్టడం విశేషం.శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే విశిష్ట పూజలు, భక్తి ప్రపత్తులకు నిలయమైందివిశేష పూజలకు, పర్వదినాల

దేవాలయంలో నిర్వహించే వేడుకలు పర్వదినాల్లో కోరికలను తీర్చే శ్రీ మహాశక్తిని దర్శించుకుని, విశేష పూజలలో పాల్గొని అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని భక్తులు పొందుతుంటారు నేడు జరిగే ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో, పూజా కార్యక్రమాలలో కూడా హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, త్రిశక్తి స్వరూపులైన శ్రీ మహాశక్తి దేవాలయ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భవిష్యత్తు

**పొగాకు బసమ్మ,జంబులింగం పేరట పాఠశాలలో స్టేజి నిర్మాణం కోసం నాలుగు లక్షల వితరణ**

**మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువుతుంటారని. రాబోయే కాలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్ అన్నారు.గురువారం కొత్తకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తన తల్లి పొగాకు బసమ్మ 5వ వర్ధంతి వేడుకలను విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్ మాట్లాడుతూ పొగాకు బసమ్మ తన తల్లి ఐదవ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్టేజి నిర్మాణం కోసం తనతోపాటు..తమ కుటుంబ సభ్యులు నాలుగు లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకొచ్చారని..వీలైనంత తొందరలో ఆ పనులు పూర్తి చేసి తమ తల్లిదండ్రులైన కీర్తిశేషులు పొగాకు బసమ్మ, పొగాకు జంబులింగం పేరట ఆ స్టేజిని పాఠశాలకు అప్పచెబుతామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ట్రైనింగ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు ఉంటారని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిణి విశ్వేశ్వర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు డాక్టర్ పీజే బాబు , పొగాకు రజనీకాంత్, పొగాకు వీరేంద్రతో పాటు..బాలుర, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయ బృందం, నాయకులు లక్ష్మన్న గారి రవీందర్ రెడ్డి, నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారంఅంబేద్కర్ నగర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**సత్తుపల్లి , అక్షిత న్యూస్:** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ అధికారి ఏ ఎల్ ఎస్ వి సునీల్ వర్మ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్, కిష్టారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కిష్టారం గ్రామంలో సింగరేణి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని కిష్టారం గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉపయోగించు కున్నారు.గ్రామస్తులకు పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరం నందు బిపి,షుగర్ ,ఇతర రక్త పరీక్షలకు సంబంధించిన పరీక్షలు చేసారు.ఈ కార్యక్రమంలో కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి,కిష్టారం ప్రాజెక్ట్ అధికారి ఏ ఎల్ ఎస్ వి సునీల్ వర్మ , సింగరేణి వైద్యులు డాక్టర్ వరుణ్, వెల్ఫేర్ ఆఫీసర్ (ఇన్చార్జి) కె శ్రీనివాస్, కిష్టారం గ్రామ పెద్దలు నరకుళ్ళ అప్పారావు మరియు కిష్టారం గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిఘా నీడలో ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామం

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం**

**రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి : జిల్లా ఎస్పీ**





**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాల ప్రారంభోత్సవనికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్,గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి**

జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతూ, యువతను మత్తు పదార్థాల దుష్ప్రభావాల నుంచి రక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

**రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి**

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిచాలని ప్రజలకు సూచించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిచమన్నారు. కోరుట్లపేట గ్రామంలో ఒక రోడ్డు ప్రమాదం జరగకపోవడం కోరుట్లపేట గ్రామ ప్రజల అవగాహనకు నిదర్శనంగా నిలిచిందన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని,పరిమితి కి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని ,రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దన్నారు. ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల ధృవపత్రాల జారీని 2-3 రోజుల్లో పూర్తి చేయాలి

### డీఆర్వో స్వామికి, ఎంఐఎం నేతల వినతిపత్రం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థుల ప్రవేశాల సీజన్ సందర్భంగా అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల తహసీల్దార్ ఎంఆర్వో కార్యాలయాల్లో ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, దరఖాస్తు చేసిన 2 నుండి 3 రోజులలోపు విద్యార్థులకు ధృవపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎఐఎంఐఎం కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో, జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్వో జె. స్వామికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు నెలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు కుల, ఆదాయ, నివాస, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, గ్యాప్, ఇతర విద్యా సంబంధిత ధృవపత్రాల కోసం పెద్ద సంఖ్యలో రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు.విద్యార్థుల అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ ప్రవేశాలు తదితర అవసరాల కోసం ఈ ధృవపత్రాలు అత్యవసరమని, జాప్యం కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, దరఖాస్తు చేసిన 2 నుండి 3 రోజులలోపు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడం ద్వారా రెవెన్యూ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కో కార్పొరేటర్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, లింగంపల్లి శ్రీను, కంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్దుల్ గఫార్, వాజిద్ అలీఖాన్, సురేష్, నాయకులు మేరాజ్, షాకిర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గురువారం 6వ డివిజన్ బొమ్మకల్ ప్రాంతంలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు శానిటేషన్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం 17వ మరియు 18వ డివిజన్లలో చేపడుతున్న మంచినీటి బావి తవ్వకం పనులను మేయర్ ప్రారంభించారు. నగర ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అలాగే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో మరియు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, అడిషనల్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన సివిల్, ఎలక్ట్రికల్

# మరమ్మతు పనులు పూర్తి చేయాలి

### తరగతులు ప్రారంభమైన దృష్ట్యా ఇంటర్ అడ్మిషన్‌లు పూర్తి చేయాలి



**మహబూబ్ నగర్ ,(అక్షితన్యూస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరమ్మత్తు పనులు, అడ్మిషన్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టి పురోగతిలో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మత్తు పనులను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని విద్య మౌలిక సదుపాయాల కల్పన,పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. అలాగే జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థుల ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పంచాయతీ రాజ్,విద్య,మౌలిక వసతుల ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కళాశాలల్లో సివిల్,ఎలక్ట్రికల్ మరమ్మతు,రిపేర్ పనులు, ఇంటర్ అడ్మిషన్లు గురించి సమీక్షించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13 కళాశాలలకు సంబంధించిన సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మత్తు పనుల పురోగతిని కళాశాలల వారీగా సమీక్షించారు. పీఆర్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కళాశాలలు,విద్య మౌలిక సదుపాయాల ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో 8 కళాశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనుల వివరాలను కళాశాల వారీగా ప్రిన్సిపల్స్,ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ఇంజనీరింగ్ అధికారులతో పనులు మంజూరు, పురోగతి, పెండింగ్ పనులపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఒకటి, రెండు కళాశాలలు మినహా మిగతా అన్ని కళాశాలల్లో పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్, వాటిని తక్షణమే ప్రారంభించి 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా కాంట్రాక్టర్ల సమస్యలు ఉంటే వెంటనే వారి స్థానంలో కొత్త కాంట్రాక్టర్లను నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

అన్ని కళాశాలల్లో పనులను వేగవంతం చేసి 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కళాశాలల్లో అడ్మిషన్ల పురోగతిని కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రవేశం కోసం వచ్చిన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించి, ఎవరికీ నిరాకరణ లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో 4838 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో 2866 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ముందస్తుగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో లభించే సౌకర్యాలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. తరగతులు ప్రారంభమైనా దృష్ట్యా విద్యార్థులు నష్ట పోకుండా అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీఆర్ , ఈ.డబ్ల్యూ.ఐ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తోగూడెం వద్ద 80 కిలోల గంజాయి స్వాధీనం

### ఫార్చ్యూనర్ కారులో తరలింపు.. ఇద్దరు అరెస్ట్, రూ.40 లక్షల విలువైన గంజాయి స్వాధీనం






**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత బ్యూరో:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీసుల అప్రమత్తతతో భారీగా గంజాయి రవాణా యత్నం భగ్నమైంది. తోగూడెం సమ్మక్క-సారలమ్మ గుడి సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీలలో సుమారు 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, గురువారం ఉదయం గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మణుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది తోగూడెం సమ్మక్క,సారలమ్మ గుడి వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి మణుగూరు వైపు వస్తున్న =జీ 03 ఖూ 4386 నంబర్ గల ఫార్చ్యూనర్ కారును ఆపి తనిఖీ చేయగా, వాహనం డిక్కీలో భారీ మొత్తంలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు.విచారణలో రాజస్థాన్ రాష్ట్రంలోని జున్‌జున్ జిల్లాకు చెందిన సురేంద్ర సింగ్ తండ్రి ఖంచంద్, ధర్మేంద్ర కుమార్ ,తండ్రి రామచందర్ లు ఒడిశా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.తమ స్నేహితుడు కపిల్ దేవ్ గంజాయి వ్యాపారం చేస్తాడని, గంజాయి రవాణా చేస్తే రూ.50 వేలు ఇస్తానని చెప్పడంతో కలిమెలకు వెళ్లి గంజాయి ప్యాకెట్లను కారులో లోడ్ చేసి భద్రాచలం మీదుగా మణుగూరుకు తీసుకొస్తున్నట్లు వెల్లడించినట్లు సమాచారం.పోలీసులు కారులో ఉన్న సుమారు 80 కిలోల గంజాయిని, ఫార్చ్యూనర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్, కపిల్ దేవ్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన మణుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని మణుగూరు డీఎస్పీ అభినందించారు.

## పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి

### ఈహెచ్‌ఎస్‌కు విధి విధానాలు ఎప్పటికి?

### ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఆర్థిక సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవుతున్నారనిసత్వరమే పెన్షనర్లకు ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించాలని నగదు రహిత వైద్యసేవలకు ఉద్దేశించిన ఈహెచ్ఎస్ విధివిధానాలు సత్వరం ప్రకటించి అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.గురువారం నాడు కృషిభవన్లో ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు.తరచూ మారుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా పెన్షనర్లు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఉద్యోగ విరమణ బకాయిలు రాకుండానే పలువురు పెన్షనర్లు తనువు చాలించారని పెన్షనర్ల బకాయిల నిమిత్తం కోట్లాది రూపాయలు విడుదల చేసామనే హోరెత్తే ప్రచారం బదులు నిధులు విడుదల చేయాలని వందలాది పెన్షనర్లకు జిపిఎఫ్ లోనే కోట్లాది రూపాయలు బకాయిలు ఉండగానే జిపిఎఫ్ చెల్లింపులు పూర్తి అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం శోచనీయం అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య విమర్శిచారు.

విధివిధానాలు లేకుండా ట్రస్ట్ కమిటీ ఏర్పాటు కాకుండానే ఉద్యోగులు పెన్షనర్ల నుండి ప్రీమియం మినహాయించిన ప్రభుత్వం తక్షణంవిదివిధానాలు ప్రకటించాలని ఏపీ వైద్యశాలల్లో వైద్య చికిత్స ఉందో తెలపాలని ట్రస్ట్ బోర్డు లో పెన్షనర్ల ప్రతినిధులుగా ఎస్జిపిఏటి తో పాటు సిపిఎస్ ఉద్యోగ సంఘం ప్రతినిధికి ప్రాతినిధ్యం కల్పించాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్ ఉపాధ్యక్షులు పెదమళ్ళసత్యనారాయణఊడుగు వెంకటేశ్వర్లు ప్రసాదరావు హుస్సేన్ నాగప్రసాద్ ఉషారాణి చీదిరాల వెంకటేశ్వర్లు భాస్కరరావు ఆదినారాయణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.